


## పలుచోట్ల వర్షం.. రైతులు హర్షం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఖరీఫ్ వరిపైరుకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుస్తుందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ముసునూరు, కొర్లకుంట, చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో వరిపైరు దుబ్బు చేసి పంట దిగుబడి పెరుగుతుందని రైతులు తెలిపారు. పది రోజులుగా భానుడు తన ప్రతాపం చూపించిన నేపథ్యంలో శనివారం కురిసిన వర్షం ప్రజలకు ఉపశమనాన్ని ఇచ్చింది.



వరి చేలో వర్షపు నీరు

# 'మెడికల్స్'లో నిబంధనలు తూచ్..!

- డాక్టర్ల చీటీ లేకుండానే మందుల విక్రయాలు
- బిల్లులు ఇవ్వకుండానే యథేచ్ఛగా అమ్మకాలు
- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నా పట్టించుకునేవారే కరువు
- విడి అమ్మకాల్లో రోగుల నుంచి భారీ దోపిడీ
- ప్రేక్షక పాత్రకు పరిమితమైన డ్రగ్స్ కంట్రోల్ శాఖ
- రెండు జిల్లాల్లో మూడు వేల వరకూ మెడికల్ దుకాణాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మెడికల్ (ఔషధాల) స్టోర్స్‌ల్లో విక్రయాలకు సంబంధించిన నిబంధనలు రెండు జిల్లాల్లో మచ్చుకైనా అమలుకాని పరిస్థితి నెలకొంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిబంధనలను అమలు చేయించాల్సిన జిల్లాలోని డ్రగ్స్ కంట్రోల్ శాఖ ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీంతో మెడికల్ స్టోర్స్ యజమానులు 'ఇచ్చిందే మందు.. చెప్పిందే ధర' అన్నట్లు పరిస్థితి తయారైంది. రోగుల నుంచి అడ్డగోలుగా దోచేస్తున్నా మెడికల్ స్టోర్సులపై ప్రభుత్వం నుంచి కనీస పర్యవేక్షణ లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు వేల వరకూ మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. ప్రతిరోజూ రూ.కోట్లలో మందుల విక్రయాలు సాగుతుంటాయి. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ప్రధాన విభాగం మెడికల్ స్టోర్స్. దగ్గు, జ్వరం ఇలా ప్రతి రోగానికీ రోగులు మెడికల్ స్టోర్స్‌ను ఆశ్రయించాల్సిందే. జీవనశైలిలో మార్పుతో బిపి, షుగర్, కిడ్నీ, కేన్సర్, నరాల సంబంధిత సమస్యలు, ఇలా అనేక రోగాలు ప్రజలను చుట్టుముడుతున్నాయి. నిబంధనల ప్రకారం డాక్టర్ చీటీ లేకుండా ఏ మెడికల్ స్టోర్‌లోనూ మందులను విక్రయించకూడదు. ఈ నిబంధన ఏఒక్క మెడికల్ స్టోర్‌లోనూ అమలు కావడం లేదు. యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి కీలక మందులను సైతం వైద్యుల చీటీ లేకుండా యథేచ్ఛగా మెడికల్ స్టోర్స్‌లో విక్రయించేస్తున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మోకాళ్లు, కీళ్ల నొప్పులకు సంబంధించి పెయిన్ కిల్లర్స్‌ను ఇష్టానుసారంగా అమ్మకాలు సాగించడంతో జనం కిడ్నీ సమస్యల బారిన పడుతున్నారు. యాంటీ బయోటిక్స్ సైతం అత్యధిక మోతాదు ఉన్నవి రోగులకు ఇచ్చేస్తున్నారు. ఇది రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇటీవల పలు మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేసినప్పుడు అనుమతి లేని మందులను సైతం విక్రయిస్తున్నట్లు బయటపడ్డాయి. అంతేకుండా తమకు లాభాలు అధికంగా వచ్చే మందులను రోగులకు అంటగడుతున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగిపోతున్నా ఏఒక్కరికీ పట్టడం లేదు. ముఖ్యంగా సామాన్య ప్రజానీకంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. మెడికల్ దుకాణం ఏర్పాటు చేసే వ్యక్తికి ఫార్మసీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. మెడికల్ దుకాణాలు నడుపుతున్న సగం మందికి ఫార్మసీ సర్టిఫికెట్లు లేవు. ఫార్మసీ చదువుకున్న వ్యక్తి పేరున మెడికల్ స్టోర్స్ ఏర్పాటు చేసి విక్రయాలు సాగించేస్తున్నారు. వైద్యులతో సంబంధం లేకుండా వారే రోగులకు మందులు ఇచ్చేస్తున్నారు. తలనొప్పి అని వెళ్తే ఆ మందుతోపాటు మరో రెండు, మూడు రకాల మందులను అంటగడుతున్న పరిస్థితి ఉంది. ఇవి ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతున్నాయి. మందుల విక్రయాలపై ఎటువంటి పర్యవేక్షణా లేకపోవడంతో జనం తీవ్రంగా నష్టపోతున్నారు.



### బిల్లు ఇవ్వకుండా మందుల విక్రయాలు

ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి. మెడికల్ స్టోర్స్‌లో ఎక్కడా బిల్లు అనేది ఇవ్వని పరిస్థితి ఉంది. రూ.వేలల్లో మందులు కొనుగోలు చేసినా బిల్లు మాత్రం ఇవ్వడంలేదు. ఒకవేళ గట్టిగా అడిగితే చిన్న పేపర్‌పై రాసి ఇస్తున్న పరిస్థితి ఉంది. అధికారులకు ఈ విషయాలన్నీ తెలిసినా పట్టించుకోని దుస్థితి. బిల్లులు లేకుండా రూ.కోట్లలో మెడికల్ వ్యాపారం సాగిపోతుంది. మెడికల్ స్టోర్స్ నుంచి అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందడం కారణంగానే పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా కేంద్రం ఏలూరులోని పెద్ద మెడికల్ స్టోర్స్‌లో సైతం బిల్లు ఇవ్వకుండా యథేచ్ఛగా అమ్మకాలు సాగించేస్తున్నారు. విడి అమ్మకాల్లో రూపాయి ఖరీదు చేసే మందుబిళ్లకు సైతం రూ.ఐదు, అంతకు మించి వసూలు చేస్తూ జనాలను లూటీ చేస్తున్న పరిస్థితి ఉంది. ఆసుపత్రుల్లో సొంతంగా మెడికల్ స్టోర్లు ఏర్పాటు చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు సాగిస్తున్నా పట్టించుకునేవారే లేకుండాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్ స్టోర్స్‌పై పర్యవేక్షణ పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని జనం కోరుతున్నారు.

# గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తా

**ఆదివాసీ దినోత్సవ వేడుకలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు**

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనుల అభ్యున్నతికి, సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. కోట రామచంద్రపురం ఐటిడిఎ పెరేడ్ గ్రౌండులో గిరిజన సంక్షేమ శాఖ, ఐటిడిఎ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిరిజన ప్రాంతాల నుంచి మహిళలు, యువకులు, పిల్లలు సాంప్రదాయ దుస్తుల్లో తమ ప్రత్యేక సాంస్కృతిక ఆచారాలతో తరలి వచ్చి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సాంప్రదాయ భూదేవి పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గిరిజనులు తమ జాతి సంప్రదాయాలకు ప్రతీకలైన నృత్యాలు, గీతాలు ప్రదర్శించారు. గిరిజన ఉత్పత్తులు, హస్తకళలు, ఔషధ మూలికల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతీయ జెండాను ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్ ఆవిష్కరించగా, ఆదివాసీ జెండాను ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆవిష్కరించారు. అనంతరం గిరిజన గీతాలను అందరూ సమూహంగా ఆలపించారు. మహనీయులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్, కొమరం భీమ్, బిర్సా ముండా, సోయం గంగులు, పూరెం సింగరాజు దొర, కారుకొండ సుబారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ తాను గిరిజన కుటుంబంలో పుట్టి ఇక్కడే పెరిగి డిగ్రీ వరకు చదివి ఎంఎల్ఎగా సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. గిరిజన పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, విద్య ద్వారానే ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని, వెనుకబాటు తనం తొలగి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని సూచించారు. ఆర్అండ్ఆర్ నిర్వాసితులకు ప్యాకేజీ వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. గిరిజన అభివృద్ధికి, సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రానున్న నాలుగేళ్లలో ఏజెన్సీ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు, గృహాలు, ఆరోగ్య సదుపాయాలు, తాగునీటి పథకాలు, రహదారులు, విద్యుత్ వంటి అంశాలపై ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఐ.కిషోర్, గిరిజన సంక్షేమ పీడీ ఎన్.శ్రీవిద్య, ఐసిడిఎస్ పీడీ పి.శారద, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, గిరిజన నాయకులు, ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ట్రైకార్ ఛైర్మన్, జెడ్‌పి చైర్‌పర్సన్ పోలవరం ఎంఎల్ఎ, తదితరులు

# దేశ భవిష్యత్తుకు డిజిటల్ టెక్నాలజీనే కీలకం

**టిసిఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న - ఘనంగా ఎపి నిట్ ఏడో స్నాతకోత్సవం**



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి వి.రాజన్న

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ భవిష్యత్తుకు డిజిటల్ టెక్నాలజీనే ప్రధాన చోదక శక్తిగా మారనుందని టిసిఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్)లో విద్యనభ్యసించిన 2021-25 బ్యాచ్ విద్యార్థులకు ఏడో స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఇంజినీర్లేనని తెలిపారు. ప్రపంచంలో నాల్గో ఆర్థిక వ్యవస్థగా మన దేశం అవతరించబోతుందన్నారు. డిజిటల్ లావాదేవీల్లో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఉందన్నారు. 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లతో యుపిఐ వంటి ప్లాట్‌ఫామ్‌లు ద్వారా ఏటా వంద బిలియన్లకుపైగా లావాదేవీలు నిర్వహిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా, ఆయా రంగాల్లోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిరంతర వృద్ధితోపాటు విజయాలను సొంతం చేసుకోవాలంటే అధునాతన సాంకేతికతపై పట్టు సాధించాలని, అప్పుడే లక్ష్యాలు, ఆకాంక్షలు నెరవేరతాయని చెప్పారు. కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు నిరంతర అభ్యాస సంస్కృతిని పెంపొందించడానికి సహాయపడే లెర్నింగ్ టు లెర్న్ కోర్సును ప్రవేశపెట్టాలని ఆలోచన చేస్తున్నాయన్నారు. 21వ శతాబ్దపు నిరక్షరాస్యులు చదవలేని, రాయలేని వారే కాదని, తిరిగి నేర్చుకోలేనివారే నిరక్షరాస్యులని అన్నారు. ప్రతి విద్యార్థీ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఆరోగ్యమే సంపద అని చెప్పారు. విద్యార్థులు నిత్యం యోగా, వ్యాయామం, నడక, పరుగు, క్రీడలు వంటి వాటి కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. నచ్చిన పుస్తకాలను చదవటం, సంగీతాన్ని వినటం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని వివరించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఎపి నిట్‌లో విద్యార్థులు సంపాదించుకున్న జ్ఞానం, ఆధునిక నైపుణ్యాలు తమ జీవితాల్లో ముందడుగు వేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికత అంశాలు ఆవిష్కృతమవుతున్నాయని, వాటిలో మెళకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారే అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారని చెప్పారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ, నూతన ప్రాజెక్టులు చేపడితే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడంతోపాటు కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తమ విద్యాసంస్థకు చెందిన పలువురు ప్రొఫెసర్లు భారత ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే పలు ప్రాజెక్టులను దక్కించుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. సంస్థ పురోగతి నివేదికను అందజేశారు. అనంతరం 2021-25 బ్యాచ్‌లో ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసుకున్న 667 మంది విద్యార్థులకు డిగ్రీలు, పిహెచ్‌డి పూర్తి చేసిన 29 మంది పరిశోధన విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. వీరితోపాటు కోర్సుల వారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందించారు. బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన కలిదిండి పవన్ తేజ సత్యవర్మకు ఇనిస్టిట్యూట్ తరపున, కోర్సుల వారీగానూ రెండు బంగారు పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, సెనేట్ సభ్యులు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# ఆదివాసీ చట్టాలపై దాడి ఆపాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలి**

**ఆదివాసీ ఐక్య వేదిక జాతీయ నాయకులు, గిరిజన సంఘం నాయకులు**

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ చట్టాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ఆపి, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ ఐక్య వేదిక జాతీయ నాయకులు, గిరిజన సంఘం నాయకులు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాగణం వరకు సాగింది. ర్యాలీలో అధిక సంఖ్యలో గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివాసీ జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం సభలో ఆదివాసీ ఐక్య వేదిక జాతీయ నాయకులు, గిరిజన సంఘం నాయకులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలపై దాడి చేస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న భూములను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పడానికి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నాయన్నారు. జిఒ3 స్థానంలో ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలని కోరారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం గిరిజన సాగులో ఉన్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఫిలిప్స్, పోలోజు నాగేశ్వరరావు, కురసం భీమరాజు, తలం రాజు, కుంజ శ్రీరాములు, గుజ్జు డేవిడ్‌రాజు, నేతి విశాక్, జిఎ.షేప్ పాల్గొన్నారు.



బుట్టాయగూడెం : ర్యాలీలో నేతలు, గిరిజనులు

**వేలేరుపాడులో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో..**

వేలేరుపాడు రూరల్ : మండలంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వసంతవాడ, కొత్తూరు యర్రతోగు, గుంపెన్నగూడెం గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, మండల కార్యదర్శి మడకం ఏసుబాబు, ఎజిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మాడి ప్రసాద్ రెడ్డి, మండల నాయకులు కారం వెంకట్రావు జెండా ఎగురవేసి వేసి పతావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను గౌరవించాలని, పోలవరం ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించాలని, జిఒ-3ని పునరుద్ధరించాలని, గిరిజన సమస్యలపై ప్రభుత్వం కట్టుబడి ఉండి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి గిరిజన చట్టాలను కాపాడాలని కోరారు. మండల నాయకులు గిరిజనులకు ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**లేకుంటే పెద్దఎత్తున పోరాటాలు**

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్**

ప్రజాశక్తి - కలిదిండి

కార్మికులకు ఎన్నికల సమయంలో టిడిపి కూటమి ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేకుంటే పెద్ద ఎత్తున కార్మిక పోరాటాలు తప్పవని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సిఐటియు ఐదో మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కార్మిక సమస్యలపై తాము పోరాటాలు చేస్తుంటే అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని చంద్రబాబు వాగ్దానం చేశారన్నారు. కాని అధికారంలోకొచ్చి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లైములు పరిష్కరించాలన్నారు. ఆటో, హమాలీ తదితర అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రయివేటీకరణతో కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ నిర్వీర్యం అవుతున్నాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మౌనం వహించడం దుర్మార్గమన్నారు. సిఐటియు మండలాధ్యక్షులు ఎస్‌కె అభిదా బేగం అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.మహంకాళిరావు, రైతు సంఘం నాయకులు వి.భాస్కరరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

# ఆదివాసీల హక్కులు పరిరక్షించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి**

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఆదివాసీల హక్కులను ప్రభుత్వాలు పరిరక్షించాలని, ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ 31వ దినోత్సవం మండలంలోని సాలిగూడెం ఎర్రకాల్వ భూపోరాట కమిటీ, అల్లూరి సీతారామరాజు కాలనీ కమిటీల ఆధ్వర్యంలో శనివారం ఎఎస్ఆర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు కాపాడాలని, ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలు ఏజెన్సీలో గిరిజనుల మనుగడకు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు, మరోపక్క రిజర్వాయర్లు, తుపాకుల ఫ్యాక్టరీ అంటూ గిరిజన ప్రాంతాన్ని కుదించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో గిరిజన మండలాల్లో ఉన్నటువంటి గిరిజనులందరినీ ఒకటి, రెండు మండలాల్లోకి సర్దుతున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అధికారులు ఏజెన్సీ చట్టాలను పట్టించుకోవటం లేదని, ఏజెన్సీ చట్టాలైన 1/70, జిఒ నెం.3 చట్టాలను తుంగలో తొక్కేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తాటి బూశమ్మ, మడకం కుమారి, బరగడ కుమారి, ఎం.శిరీషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించిన నేతలు

# భారాలు.. ఆందోళనలు


**పాలకుల భారాల మోతకు వ్యతిరేకంగా రెండు జిల్లాల్లో ఆందోళనలు మిన్నంటాయి. గతానికి భిన్నంగా మరోసారి పాలకుల చర్యలు.. వామపక్షాల ప్రతిస్పందనలపై జనంలో పెద్ద ఎత్తున చర్చ సాగడం మంచి పరిణామంగా చెప్పకోవచ్చు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యాన చేపట్టిన ధర్నాలు విజయవంతమయ్యాయి. వివిధ తరగతుల ప్రజానీకం ఈ ఆందోళనకు మద్దతు పలకడం భారాల ప్రభావాన్ని చెప్పకనే చెబుతోంది.**

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు కేటగిరి-2 కనెక్షన్లకు పెద్ద ఎత్తున సాగింది. ఆ సమయంలో వామపక్షాలు, ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తూ ప్రచారం సాగించినా దాని ప్రభావం మాత్రం ఇప్పుడిప్పుడే కన్పిస్తుండడంతో జనం రోడ్డెక్కుతున్నారు. చిన్నపాటి పచారీ దుకాణానికి గతంలో రూ.500 లోపు కరెంటు బిల్లు వస్తే స్మార్ట్ మీటర్ బిగించాక రూ.వెయ్యికిపైగా వస్తుండడం అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దీనిపై స్థానికంగా ఉండే లైన్‌మెన్లను వివరాలు అడిగినా ఎఇ కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్నారని, అక్కడకు వెళ్తే డిఇ కార్యాలయం అంటూ స్పష్టమైన సమాధానం చెప్పేవారే కరువయ్యారని వాపోతున్నారు. దీంతో కాగితాలు పట్టుకుని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎటువంటి స్పందనా ఉండడం లేదని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన చేపట్టిన సంతకాల సేకరణ సందర్భంగా బాధితులు చెప్పడమే దీనికి నిదర్శనం. అదే సమయంలో ట్రూఅప్ ఛార్జీల భారం జనాన్ని తీవ్ర వేదనకు గురి చేస్తోంది. మొత్తంగా విద్యుత్ భారాల మోత అటు వైసిపి హయాంలోనూ, ఇటు కూటమి ప్రభుత్వ హయాంలోనూ ఒకేలా ఉందంటూ జనం వామపక్షాలు, ప్రజాసంఘాలు చేపట్టిన ధర్నాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారు కొందరైతే, పరోక్షంగా మద్దతు తెలిపిన వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. మొత్తంగా పాలకుల విద్యుత్ విధానాలకు వ్యతిరేకంగా జనం కదులుతున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఇక మన ప్రధాని మోడీకి మంచి మిత్రునిగా చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దేశ ఉత్పత్తులపై విధించిన సుంకాల భారంతో జిల్లాలోని ఆక్వా రంగం మరోసారి తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. గతంలో సుంకాల భారం మోత మోగించినప్పుడు రొయ్యల ధర గణనీయంగా పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ సారీ అదే పరిస్థితి కన్పిస్తోంది. కౌంట్‌కు సుమారు రూ.40 నుంచి రూ.పది వరకూ తగ్గిపోయిన పరిస్థితి ఉంది. దీంతో ఇటు రైతులు, అటు ఎగుమతిదారులు నష్టపోయే దుస్థితి దాపురించింది. అటు సుంకాలకు వ్యతిరేకంగా, ఇటు ఆక్వా రంగాన్ని ఆదుకునేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన ప్రకటనా రాకపోవడం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పెద్దలు సైతం స్పందించకపోవడంపై ఆక్వా రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ రాయితీ అమలు కాక, ఛార్జీల భారం భరించలేకపోతున్నామని లబోదిబోమంటున్నారు. ప్రధానంగా వాడిన కరెంటు కన్నా ట్రూఅప్, ఇతర ఛార్జీల పేరుతో విద్యుత్ బిల్లుల బాదుడు దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. అదనపు ఛార్జీలు రద్దు చేసి వినియోగించిన విద్యుత్ వరకే బిల్లులు పరిమితం చేయకపోతే ఆక్వా రైతులు సాగు దూరం కావడం తప్ప మరో మార్గం కన్పించడం లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వా రంగ పరిరక్షణకు అమెరికా సుంకాల భారం, విద్యుత్ ఛార్జీల మోత నుంచి తప్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపడతాయో వేచిచూడాలి. లేనిపక్షంలో ఆక్వా రైతులు, ఆ రంగానికి సంబంధించిన వారు రోడ్డెక్కే సూచనలైతే స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఇక మా పని మమ్మల్ని చేయనీయండి, ఇతర పనులు, యాప్‌ల భారం తగ్గించాలంటూ ఇటు ఉపాధ్యాయులు, అటు అంగన్వాడీలు ఆందోళన బాట పట్టారు. తమను బోధనేతర పనుల నుంచి తప్పించాలని ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు రెండు జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. గతంలో అన్ని యాప్‌లూ ఒకే యాప్‌గా మార్చినా అదే భారం కొనసాగుతోందని, తరచూ సర్వర్ సమస్య వస్తోందని ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు. దీనికితోడు అర్జంట్ మెసేజీ, వెరీ అర్జెంట్ మెసేజీ అంటూ ఒకే సమాచారాన్ని రెండు రోజులకోసారి తిప్పితిప్పి అడుగుతూ మానసికంగా వేధిస్తున్నారని వాపోతున్నారు. తక్షణం బోధనేతర పనుల నుంచి తమను మినహాయించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇక అంగన్వాడీలు ఆన్‌లైన్ పనులు భారంగా మారాయని, గతంలో ఇచ్చిన 2జీ ఫోన్లతో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందంటూ తమ ఫోన్లను ఆయా సిడిపిఒ కార్యాలయాల్లో అందజేసి నిరసన తెలిపారు. తమకు 5జి ఫోన్లు ఇవ్వడంతోపాటు యాప్‌ల భారం తగ్గించాలని కోరుతున్నారు. అంటే పాలకుల విధానాల ఫలితంగా పేద ప్రజల నుంచి చిరుద్యోగులు, మధ్యతరగతి ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారని స్పష్టమవుతోంది. ఇదే భారాల మోత కొనసాగితే ఆయా తరగతుల ప్రజలు సైతం రోడ్డెక్కుతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్




# రైతు మనుగడ కోసం ఉద్యమాలే మార్గం

**రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్**

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వ్యవసాయంలో రైతు మనుగడ కోసం ఉద్యమాలే మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. జీలుగుమిల్లి, సుందరయ్య కాలనీలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ సంఘం మండలాధ్యక్షులు దాసరి జానకి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. మహాసభ ప్రారంభ సూచికంగా రైతు సంఘం జెండాను తాళ్లూరి సూర్యారావు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, నష్టాల్లో కూరుకుపోతున్న అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన ఏ ఒక్క పంటకు కనీస మద్దతు ధరలు రావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేలా, రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ వ్యవసాయంగా మార్చేలా ఉన్నాయని విమర్శించారు. వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. వర్జినీయ పొగాకు, ఆయిల్ పామ్, మిర్చి, మొక్కజొన్న, కోకో తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సన్న చిన్న కారు పేద రైతులకు వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కమతం ప్రాతిపదికన అన్ని పంటలకు బీమా పథకం అమలు చేయాలని, ప్రీమియం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, సిఐటియు మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కారం నాగదుర్గ, జానకిరామిరెడ్డి, సుంకవల్లి శేషగిరిరావు, బొంతు వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్, తాళ్లూరి సూర్యారావు, దాసరి రామారావు, చోడెం కన్నప్పరాజు, పాయం లక్ష్మణరావు, జక్కుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

## భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

**భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆరో మహాసభ ఈ నెల 20వ తేదీన ఏలూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు తెలిపారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రక్షణగా ఉండే భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని తెలుగుదేశం కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. తెలుగుదేశం మేనిఫెస్టోలో పెట్టామని లోకేష్ కార్మికులను నమ్మబలికి ఓట్లు వేయించుకుని అధికారంలోకొచ్చి సంవత్సరం కాలం పూర్తవుతున్నా నేటి వరకూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు జరగకుండా ఇచ్చిన 1214 మెమో రద్దు చేసి వెంటనే వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలన్నారు. లేకపోతే సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, కోశాధికారి రెడ్డి లక్ష్మణరావు, సభ్యులు తడి సత్యనారాయణ, తెల్లగ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

## దోమలు ప్రబలకుండా ఫాగింగ్

**ప్రజాశక్తి - ఆగిరిపల్లి**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆగిరిపల్లి గ్రామ సర్పంచి చవలపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో దోమలు ప్రబలకుండా శనివారం ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మణి, ఎఎన్ఎం సాంబలత, ఆశావర్కర్లు పద్మ, జయలక్ష్మి, శివనాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## వృద్ధురాలికి గ్యాస్ కనెక్షన్ అందజేత

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

అడిగిన వెంటనే ఓ వృద్ధురాలికి కొడాలి వినోద్ గ్యాస్ కనెక్షన్ అందించిన వైనమిది. మండలంలోని వైవాక గ్రామంలో టిడిపి నియోజకవర్గ కో-కన్వీనర్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినోద్ గ్రామానికి చెందిన వృద్ధురాలు చేబోయిన వీరమ్మను కలిసి దీపం పథకం అందుతుందా అని అడగగా వృద్ధురాలు నాకు గ్యాస్ కనెక్షన్ లేదు, ఇప్పించండి అని వినోద్‌ను కోరింది. దీంతో వినోద్ వెంటనే స్పందించి అడిగిన వృద్ధురాలికి బొర్రా బాలసాయి భారత్ గ్యాస్ ట్రస్ట్ తరఫున గ్యాస్ కనెక్షన్ అందించారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వై.విజయకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో శనివారం రాత్రి ప్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, బహుమతులు హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయుడు ప్రసాద్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ పి.సురేష్‌బాబు, హిందీ మాస్టారు సత్యనారాయణ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వ్యసన విముక్తిపై అవగాహనా ర్యాలీ

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు పట్టణంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శనివారం మత్తు పదార్థాల వ్యసన విముక్తిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎల్ఎ పిఎకు మాతృవియోగం

**చింతలపూడి :** చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పిఎ అజ్జర్ హుస్సేన్ తల్లి శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్, ఆయన సతీమణి విజయరత్ కలిసి అజ్జర్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పిఎ తల్లి మృతికి సంతాపం, కుటుంబానికి సానుభూతి తెలిపారు.

### నేరాలు - ఘోరాలు

## విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

**శోక సంద్రంలో కుటుంబసభ్యులు**

**ప్రజాశక్తి - ముదినేపల్లి**


ఏసురాజు (ఫైల్)

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం ముదినేపల్లిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ముదినేపల్లి స్థానిక ప్రాంతానికి చెందిన విద్యార్థి ఎం.ఏసురాజు (13)స్థానిక జెడ్‌పి హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తన తల్లి సమీపంలో ఉన్న ఇంటిలో పని చేస్తూ ఉంటుంది. శనివారం సాయంత్రం తల్లితో పాటు యేసురాజు తల్లి పనిచేసే ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో తల్లి ఇంట్లో పని చేస్తుండగా ఏసురాజు పైపు నీళ్లు పట్టేందుకు కరెంట్ మోటార్ వేశాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఏసురాజు మరణంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. కుమారుని మృతదేహం చూసి తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. అప్పుడే నిండా నూరేళ్లు నిండిపోయాయా కొడుకా అంటూ విలపించింది. కరెంట్ మోటార్ వద్ద కరెంట్ ఎర్త్ అవుతుందంటూ పలు సార్లు ఏసురాజు తల్లి తెలియజేసినప్పటికీ ఆ ఇంటి యజమాని పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగి తన కుమారుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

## యువకునిపై కత్తితో దాడి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

ఇద్దరు స్నేహితుల మధ్య చిన్న విషయంలో మాట మాట పెరగడంతో ఒకరు మరొకరిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటన ఏలూరు రూరల్ మండలంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ మండలం హనుమాన్ నగర్‌కు చెందిన కృష్ణవరపు ఆంజనేయ వరప్రసాద్ స్థానికంగా కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పేరాడ శివాజీ ఇతనికి చిన్ననాటి నుంచి స్నేహితుడు. శనివారం వీరిద్దరి మధ్య చిన్న విషయంపై మాట మాట పెరిగింది. దీంతో ఆంజనేయ వరప్రసాద్‌పై శివాజీ కత్తితో దాడి చేశాడు. గమనించిన ప్రసాద్ బంధువులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

## గుర్తు తెలీని వాహనం ఢీకొని మహిళకు గాయాలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

గుర్తు తెలీని వాహనం ఢీకొని మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన కల్వపూడి సత్రం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వడాలి గ్రామానికి చెందిన నూలు వెంకట వరలక్ష్మి ఈ నెల నాలుగో తేదీ పెదపాలపర్రు పని నిమిత్తం వెళ్లి అనంతరం ఇంటికి వస్తుండగా రాత్రి ఏడు గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం వెంకట వరలక్ష్మిని ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో వెంకట వరలక్ష్మి రక్త గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 108 వాహనంలో వెంకట వరలక్ష్మిని చికిత్సకై గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమార్తె నూలు వెంకటరమణ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి ఎస్ వీరభద్రుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ఘనంగా రాఖీ పండుగ వేడుకలు


ఏలూరు సిటీ : గన్నికి రాఖీ కడుతున్న పద్మశ్రీ

**గన్నికి రాఖీ కట్టిన జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ**

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ఆప్కాబ్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ రాఖీ కట్టి సోదర సోదరీ భావాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పండుగ భారతీయ సాంప్రదాయంలో సోదర సోదరీల మధ్య ఉన్న అపూర్వమైన అనుబంధానికి ప్రతీక అని చెప్పారు. సోదరి కట్టే రాఖీ కేవలం ఒక దారమే కాకుండా అది ప్రేమ, ఆప్యాయత, రక్షణ, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.


**ఎంఎల్ఎకు రాఖీలు కట్టిన మహిళలు**

**చింతలపూడి :** వెలకట్టలేని మధుర బంధమే రక్షాబంధన్ అని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా తెలుగు మహిళలు ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మహిళల రక్షణ, ఆర్థిక భద్రతకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. తాను చింతలపూడి ఎంఎల్ఎగా ఎన్నిక కావాలని ఎంతో మంది అక్కాచెల్లెళ్లు కోరుకున్నారన్నారని, వారి దీవెనలతో ఎంఎల్ఎగా ఎన్నికయ్యాయని, స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తూ అక్కాచెల్లెళ్ల అవసరాలు తీర్చి వారి రుణం తీర్చుకుంటున్నామని తెలిపారు. తెలుగు మహిళలకు స్వీట్లు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.


చింతలపూడి : ఎంఎల్ఎకు రాఖీ కట్టిన మహిళలు

**మాజీ సైనికులకు రాఖీలు కట్టిన మహిళలు**

**ఉంగుటూరు :** రాఖీ పౌర్ణమి సందర్భంగా వివిధ హోదాలో దేశ రక్షణ కోసం పని చేసిన మాజీ సైనికులకు శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో రాఖీలు కట్టారు. నారాయణపురం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం విశ్రాంత సైనికులు దిడ్ల శ్రీను, పొన్నాడ రవి, సీపాని శివ బాలాజీ, బ్రహ్మం, రమేష్, కర్రి ప్రసాద్, సత్యనారాయణలకు రాఖీ కట్టి సత్కరించారు. పరస్పరం స్వీట్లు తినిపించారు. గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద, బిజెపి నాయకురాలు అడపా శోభారాణి, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.


ఉంగుటూరు : మాజీ సైనికులకు రాఖీ కట్టిన మహిళలు

**ఎంఎల్ఎ చింతమనేనికి రాఖీ కట్టిన మహిళలు**

**దెందులూరు :** రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు బ్రహ్మ కుమారి సమాజం ప్రతినిధులు, కూటమి మహిళా నాయకులు, నియోజకవర్గ మహిళలు, చిన్నారులు రక్షాబంధనాన్ని కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా సుదూర గ్రామాల నుంచి సైతం కొండంత అభిమానంతో తరలివచ్చి తనకు రక్షాబంధనాన్ని కట్టి సోదర భావాన్ని పంచిన ప్రతి ఒక్కరికి కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.

### అన్నా.. నీవులేని లోకంలో నాకు తోడేది

**అన్న సమాధి నామ ఫలకానికి రాఖీ కట్టిన సోదరి**


రాఖీ కడుతున్న సోదరి

**దెందులూరు :** అన్నా, చెల్లెళ్ల అనుబంధం మాటల్లో వర్ణించలేం. ఇద్దరి మధ్య అనుబంధానికి అవధులే ఉండవు. అమ్మా, నాన్న ప్రేమను పంచితే అన్నయ్య, చెల్లమ్మ జోడీగా ఆ ఆనందాన్ని పొందుతూ.. ఒకరికొకరు తోడూ, నీడగా కడ వరకు రక్త సంబంధంలో మాధుర్యాన్ని అనుభవిస్తూ ఉంటారు. అలాంటి అన్న తిరిగిరాని లోకాలకు చేరితే..అందునా అజన్మఅంతం అండగా నిలుస్తాడనుకున్న అన్న యుక్త వయసులోనే దూరమైతే ఆ బాధ వర్ణనాతీతం. శనివారం రక్షాబంధన్.. తోటి వారంతా తమ అన్నలకు రాఖీలు కడుతుంటే.. చెమర్చిన కన్నీటితో.. బాధను పంటి బిగువున దాచుకుని, అన్న సమాధి రాయికే రాఖీ కట్టింది ఆ చెల్లెమ్మ.. పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన ఐరన్ రాడ్ బెండర్ డి.రాజు కుమారుడు గోటికల తేజ (19) గతేడాది ఆగస్టులో గుంటూరు జిల్లా బాపట్ల బీచ్ వద్ద ఈతకు వెళ్లి మృతి చెందాడు. సదరు యువకుడు మరణించి ఈ నెల 21 నాటికి ఏడాది పూర్తవుతుంది. ఈ దశలో సదరు యువకుని సోదరి శనివారం ఇలా తన అన్నపై అభిమానంతో సమాధి నామ ఫలకానికి రాఖీ కట్టి కళ్లంట నీరు పెట్టుకోవడం అందరిని కలచివేసింది.

# ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి - చింతలపూడి**

మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని ఆదివాసీ జెండా ఎగురవేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసీల సొంతమన్నారు. వారికి అన్నివిధాలా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా, తెలంగాణ నుంచి నాయక్ పోడ్ నాయకులు ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**పోలవరం :** మానవ నాగరికతకు ఆదివాసీలే పునాదులని ఐటిడిఎ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎల్ఎన్‌డిపేట గ్రామంలో కోండ్రుకోట పునరావాస కాలనీలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న ఆయన ఆదివాసీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీల నుంచే మానవ నాగరికత ప్రారంభమైందన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఆదివాసీపై ఉందన్నారు. ఏజన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ప్రగడపల్లి పంచాయతీ రామన్నపాలెంలో కలుం వెంకటేశ్వరరావు నాయకత్వంలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు పూర్తిగా సాధించిన రోజే తమకు నిజమైన పండుగ అన్నారు. గిరిజన సాంప్రదాయ డప్పు వాయిద్యాలు, డ్యాన్సులు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమాలలో కోండ్రుకోట సర్పంచ్ పైదా నాగరాజు, ఏజన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు, నవయువ సమాఖ్య రాష్ట్ర నాయకులు ఎస్ మోహన్, పీసా కమిటీ సభ్యులు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి : మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

**కుక్కునూరు :** ఆదివాసీ సంక్షేమ పరిషత్ (274/16) ఆధ్వర్యంలో కుక్కునూరు మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ వాయిద్యాలు, కళాకారుల నృత్యాలతో భారీ ర్యాలీతో కార్యక్రమం ప్రారంభమైంది. ఆదివాసీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆదివాసీ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు కూరం సంజీవరావు, ప్రచార కార్యదర్శి వేణుగోపాల్, ఎటిఎ జిల్లా నాయకులు, సర్పంచులు, ఆదివాసీ నాయకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి వందలాది మందితో అశ్వారావుపేట, బూర్గంపాడు, రామసింగారం సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఆదివాసీ సాంప్రదాయ డోలు, కొయ్యలు, డప్పు వాయిద్యాలు, రేలా పాటలు, నృత్యాలు చేశారు. అనంతరం రామసింగారం యుపిఎస్ స్కూల్ వద్ద జరిగిన సభకు మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షత వహించారు. జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ ముఖ్య వక్తగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల నాయకులు మచ్చ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**బుట్టాయగూడెం :** ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మాల సురేష్ మాట్లాడారు. ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్, న్యాయవాది ఏసుబాబు, వెట్టి సుబ్బన్న, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, పివైఎల్.నాయకులు తగరం బాబూరావు, గురుగుంట్ల ప్రసాద్, కెచ్చెల పోతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సభ అనంతరం గ్రామంలో డప్పు నృత్యాలతో, రేలా పాటలతో ప్రదర్శన నిర్వహించారు.

## ట్రైనింగ్ కానిస్టేబుళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్**

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

ట్రైనింగ్‌కు వచ్చే పోలీస్ కానిస్టేబుళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. వారికి ట్రైనింగ్ ఇచ్చే సమయంలో తరగతి గదులను, హాస్టల్ భవనాలను, మౌలిక సదుపాయాలను పూర్తిగా తనిఖీ చేశారు. సంబంధిత డిటిసి డిఎస్‌పిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కానిస్టేబుళ్లకు ట్రైనింగ్ ఇచ్చే సమయంలో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని సూచించారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు కూడా ఆధునీకరించాలని ఆదేశించారు. స్నానాల గదిలో కూడా వసతులను మెరుగుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిసి సిఐ రామారావు, ఆర్ఐ పవన్ కుమార్, డిటిసి ఎస్ఐలు విజయ్‌కుమార్, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిందితులకు శిక్షలు పడేలా చూడాలి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టే ప్రక్రియలో కోర్టు మానిటరింగ్ పోలీసులు కీలక పాత్ర వహిస్తారని ఎఎస్‌పి సూర్యచంద్రరావు తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశ మందిరంలో కోర్టు మానిటరింగ్ సెల్ విభాగంతో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం ఎఎస్‌పి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కోర్టుల్లో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుళ్ల, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జి సుబ్బారావు, డిసిఆర్‌బి సిఐ హబీబ్ భాషా పాల్గొని సిబ్బందితో కోర్టు కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో ఛార్జిషీట్లను వెంటనే దాఖలు చేయాలని సూచించారు. కేసుల్లో సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ కేసులో అయినా సరే నిందితులు తప్పించుకోకుండా ఉండేందుకు పూర్తి జాగ్రత్తలు తీసుకునే బాధ్యత కోర్టు మానిటరింగ్ సెల్ పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, నూజివీడు, పోలవరం, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ల పరిధిలో కోర్టుల్లో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ఆదర్శ దళిత పరిరక్షణ సంఘం ముదినేపల్లి మండల కార్యవర్గ సభ్యుడు ముత్యాల రాంబాబు తల్లి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆదర్శ దళిత పరిరక్షణ సంఘం మండల సభ్యులు శనివారం సింగారం వెళ్లి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సంఘ సభ్యులు దాకరపు నాగమల్లేశ్వరరావు, సోమల వరప్రసాద్, నిమ్మగడ్డ బిక్షాలు, లేళ్ల ఆంజనేయులు, గోరుముచ్చు స్వామియేలు, దాసి రంగారావు, పళ్లెం పుణేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## తమ్మిలేరు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

**ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

తమ్మిలేరు భూములు అన్యాక్రాంతమవుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఒక ప్రకటనలో ఆరోపించారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ల గ్రామంలో ఎఫ్‌సిఐ గొడౌన్ల వద్ద తమ్మిలేరు భూమిని కొంతమంది భూస్వాములు ఇనుప కంచెలు వేసి దుక్కి దున్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ భూమి అని, దీనిని ఆక్రమించుకున్న వారిపై ప్రభుత్వం, తమ్మిలేరు ఇరిగేషన్ అధికారులు స్పందించాలని కోరారు. ఇప్పటికే తమ్మిలేరుకు ఆనుకుని ఉన్న వేలాది ఎకరాల భూములను భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పేదలు, దళితులు, గిరిజనులు భూమి లేని వారు సెంటు భూమి సాగు చేసుకుంటే వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న సందర్భంలో తమ్మిలేరు ఇరిగేషన్ భూములను భూస్వాముల ఆక్రమించుకుంటే ఎందుకు కేసులు పెట్టడం లేదని, ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదలకు ఒక రకమైన చట్టం, భూస్వాములకు, పెద్దలకు మరోరకమైన చట్టం అమలు చేస్తున్నారా అని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ్మిలేరు భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని, వారి నుంచి భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

## వర్షంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ పాత్రలో చింతమనేని

**రోడ్లపై గుంతల సమస్య పరిష్కారానికి చర్యలు**

**ప్రజాశక్తి - దెందులూరు**


ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

రోడ్డుపై గుంతల కారణంగా నిలిచిన ట్రాఫిక్‌ను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ క్లియర్ చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో దెందులూరు మండలం సోమవరప్పాడు వద్ద అటుగా ఎంఎల్ఎ ప్రయాణిస్తుండగా అక్కడ రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరి మోటారు బైక్‌లు, కార్లు, లారీలు నిలిచిపోయి ట్రాఫిక్ ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడడం గమనించారు. వెంటనే తన కాన్వాయ్ నుంచి దిగి తానే ఒక ట్రాఫిక్ పోలీస్ అవతారం ఎత్తి రోడ్డుకు మధ్యలో నిలబడి ముందుగా భారీ వాహనాలను పక్కకు తప్పించి, ద్విచక్ర వాహనాలను ఒక వైపుగా పోనివ్వడం, అదేవిధంగా ఎదురుగా వచ్చే వాహనాలను క్రమబద్ధీకరిస్తూ దాదాపు 20 నిమిషాల పాటు అక్కడ సమయాన్ని కేటాయించారు. ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌లాగా బాధ్యతలు నిర్వహించి పూర్తిగా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అదేవిధంగా ఇంతలా ప్రజలు ఇబ్బంది పడడానికి కారణమైన గుంతలను సైతం తన కార్యాలయ సిబ్బంది ద్వారా ఫొటోలు తీయించి వాటిని ప్రాజెక్టు డైరెక్టర్, నేషనల్ హైవే అథారిటీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని చెప్పి ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే వాటిపై ప్రజలు ఫిర్యాదు చేసే వరకు ఎదురుచూస్తూ కూర్చోకూడదని, స్థానిక కూటమి నాయకులు, నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వాటిని గుర్తిస్తే సత్వరమే వాటిని పరిష్కరించే విధంగా చొరవ చూపాలన్నారు. ప్రజలను అవస్థల పాలు చేస్తున్న గుంతల సమస్యను పరిష్కరించేలా నేషనల్ హైవే అధికారులు కూడా వెంటనే తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేస్తానని ఎంఎల్ఎ తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**టూల్స్ డౌన్ చేసి నిరసన**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిరక్షణలో వహిస్తున్న నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సెక్షన్ ఉద్యోగ సిబ్బంది ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకత్వంలో ఆర్‌ఆర్.పేట ఎస్ఆర్-2 వద్ద శనివారం టూల్స్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎన్ఎంఆర్ ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చి, అధికారంలోకొచ్చి సంవత్సరం పూర్తయినా హామీని అమలు చేయలేదన్నారు. రెగ్యులర్ సిబ్బందికి బకాయిపడిన సరెండర్ లీవులను చెల్లించాలని, బకాయి పడిన ఆరు డిఎలను చెల్లించాలని, 11వ పిఆర్‌సిలో పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగ, సిబ్బంది సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. టూల్స్ డౌన్ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కడుపు కన్నయ్య, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నారా శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, కందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పలుచోట్ల అన్నదానం

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని ప్రొద్దువాక గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమారాధనలో పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కో-కన్వీనర్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ హాజరై వడ్డన చేశారు.

**జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం ఉత్తరం వైపు ఏడుకొండలలో ఆరో కొండపై పారిజాత వృక్షాల్లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాఖీ పౌర్ణమి, స్వామివారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం కావడంతో శ్రీదేవి భూదేవిఅమ్మవారి శ్రీనివాసుని కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి గిరి ప్రదక్షిణలో వేలాది సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

## పాస్‌పోర్టు పోయినది

ఏలూరు మండలం రత్న బేకరీ రోడ్డు ఆర్‌ఆర్ పేట కు చెందిన గుల్లిపల్లి నవీన్ బాబు అను నేను 2-7-2025వ తేదీన నేను నా బండి మీద ఇంటి నుండి విజయ విహార్ సెంటర్ కు వస్తున్న సమయంలో నా బ్యాగ్ జారీ పడి పోయినది అందులో నా R4546505 నంబర్ గల నా పాస్ పోర్ట్ కూడా కలదు. ఎవరికైనా పాస్ పోర్ట్ దొరికిన చో ఈ క్రింది చిరునామాలో అందజేయగలరు

**గుల్లిపల్లి నవీన్‌బాబు, రత్న బేకరీ రోడ్డు, పవర్ పేట, ఏలూరు. సెల్:70364 56652**

## పేరు మార్పు ప్రకటన

యలమదుర్తి మణి (కొత్తపేరు), భర్త యలమదుర్తి సుదర్శనరావు, డోర్‌నెం.2-42/1, రాపాకవారిపేట, దిగమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నా పేరును పెదపాటి నాగమణి (పాతపేరు) భర్త యలమదుర్తి సుదర్శనరావు నుండి యలమదుర్తి మణి (కొత్తపేరు) భర్త యలమదుర్తి సుదర్శన రావుగా మార్చుకున్నారు. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

**యలమదుర్తి మణి, భర్త సుదర్శనరావు, డోర్‌నెం.2-42/1, రాపాకవారిపేట, దిగమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిలా, ఆంధ్రప్రదేశ్.**

**మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు**

**ఇ.పి.నెం.21/2023**

బిట్వీన్ :
రామకృష్ణా ఎంటర్‌ప్రైజస్, ఏలూరు.
రిప్రజంటెడ్ బై ఇట్స్ మేనేజింగ్ పార్టనర్
శ్రీ పావరాల బ్రహ్మప్రకాష్ ...పిటీషనరు
మరియు
అధికారి ఆగ్రో సర్వీసెస్, ఏలూరు
Rep by Managing Partner తూంపాటి
అధికారి & తూంపాటి శరత్ బాబు వగయిరాలు
...రెస్పాండెంట్లు

**పిటీషనరు దాఖలు చేసిన పబ్లికేషన్**

పై నంబరు గల పిటీషన్‌లో రెస్పాండెంటు 1 నుండి 4 వారలు అనగా 1. అధికారి ఆగ్రో సర్వీసెస్, ఏలూరు దీని మేనేజింగ్ పార్టనర్స్ తూంపాటి అధికారి & తూంపాటి శరత్‌బాబు, 2. తూంపాటి అధికారి S/o.లేటు తాతయ్య, 3.తూంపాటి రవిబాబు, S/o.అధికారి, 4.తూంపాటి శరత్ బాబు, S/o.అధికారి, డోరునెం.1-19/11, శాంతి నగర్ 5వ రోడ్డు, ఏలూరు, ఏలూరు జిల్లా అనువారలకు పైకోర్టులో ది.8-9-2025 తేదీన ఉ॥10-30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనిఎడల సదరు పిటీషన్ తమ పరోక్షమున విచారణ చేయుదురని యిందుమూలముగా తెలియచేయడమైనది.

**ఆవుల జగన్మోహనరావు**
**పుప్పాల రామకృష్ణ**
అడ్వకేట్స్, శ్రీరామ నివాస్,
ఏలూరు అశోకనగర్, ఏలూరు.
తేది.9-8-2025 ఏలూరు జిల్లా.

**ప్రకటన**

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**

**DEBTOR I.P.No.14/2025**

బిట్వీన్ :
శ్రీ కంభంపాటి సూర్య ప్రకాష్‌రావు ...పిటిషనర్
మరియు
1.శ్రీ యలమాటి సురేశ్ మరియు 26 గురు
శ్రీ అఫీషియల్ రిసీవర్, ప.గో.జిల్లా., ఏలూరు.
...ప్రతివాదులు

**17వ రెస్పాండెంట్ :** శ్రీ పులుమోలు సత్యనారాయణ, S/o.బాపన్న, ఇ.నెం.3-73, నీలాద్రిపురం గ్రామము, కొమ్ముగూడెం పోస్ట్, తాడేపల్లిగూడెం మండలము, ప.గో.జిల్లా. - 534101, ఫోన్:9984361601.

**25వ రెస్పాండెంట్ :** శ్రీమతి పాముల కుమారి, W/o.ప్రసాద్, ఇంటి నెం.3-751, నీలాద్రిపురం, గ్రామము, కొమ్ముగూడెం పోస్ట్, తాడేపల్లిగూడెం మండలము, ప.గో.జిల్లా. -534101. ఫోన్:9347665120

**Petitioner (పిటిషనర్) /Debtor (ఋణగ్రహీత) తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ వ్యాపారములో నష్టపోయి, ఎవరికి డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న కారణముగా సదరు I.P.No.14/2025 ను మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో వేసినారు. దావాలో ప్రతివాదులు అయిన పులమోలు సత్యనారాయణ, 17వ రెస్పాండెంట్, మరియు శ్రీమతి పాముల కుమారి, 25 రెస్పాండెంట్‌లకు శ్రీ కోర్టు ద్వారా పలుమార్లు నోటీసులు పంపినా తీసుకొనని కారణముగా ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియపరచమని సదరు కోర్టు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు ది.21-08-2025 ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల సదరు నెంబరు IP ద్వారా న్యాయస్థానం వారు మీకు పరోక్షమున తీర్మానించెదరు అని తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble C.J.Court (Senior Division) T.P.G.)

**ఈడా ఫరోత్‌బాబు,**
తేది.09.08.2025 న్యాయవాది, తాడేపల్లిగూడెం,
తాడేపల్లిగూడెం సెల్: 9441880541